క్లుప్తంగా

ఎంపీ గురుమూర్తితో భేటీ



ఎంపీ గురుమూర్తిని కలసిన ఏర్పేడు ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు యాదవ్

ఏర్పేడు: ఏర్పేడు ఎంపీపీగా నియమితులైన జమళ్ల శ్రీనివాసులు యాదవ్ మంగళవారం తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తిని కలిశారు. ఎంపీ ఆయన్ను శాలువాతో ఘనంగా సత్కరించి మండల అభివృద్ధికి కృషి చేయాలని, తాను ఏర్పేడు మండలవాసిగా తనవంతు మండల అభివృద్ధికి ఎంపీ నిధులను కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిందేపల్లి సర్పంచ్ పెంచలయ్య, గురునాథం, కేశవరెడ్డి, జ్ఞానప్రకాష్‌యాదవ్, అరగొండ వెంకటేష్ పాల్గొన్నారు.

విజేతలుగా నాగలాపురం విద్యార్థులు



యోగా ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

నాగలాపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలలో నాగలాపురం విద్యార్థులు విజేతలుగా నిలిచారు. రెండో రోజు మంగళవారం నిర్వహించిన ఖోఖో, యోగా ఆటల పోటీలలో నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల జట్లు విజేతలుగా నిలిచాయి. అదేవిధంగా యోగా పోటీలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విష్ణుష్ విద్యామందిర్ స్కూల్ జట్లు విజేతలుగా నిలిచాయని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.బాబు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్ర, దొరబాబు, మునికృష్ణారెడ్డి, సుధాకర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దండి



మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలకు ఉపాధ్యాయులు పదును పెట్టాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం వారు నీర్పాకోట ఎస్టీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ సబ్జెక్టు విషయ నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన అంచనా వేయడానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో అకడమిక్ ఫోరంలు ఏర్పాటు చేసి దశల వారీగా అన్నీ పాఠశాలలను సందర్శించనున్నారని తెలిపారు. అడకమిక్ ఫోరంలు పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు పాఠశాల పరిపాలనకు సంబంధించి సమగ్ర వివరాలు సేకరిస్తారన్నారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ–1 పరీక్షలకు సంబంధించి విద్యార్థులు రాసిన మూల్యాంకనం పుస్తకాలు, పరిశీలన, తదితర అంశాలపై అకడమిక్ ఫోరం చూడనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనువైన పశువుల కొనుగోలు చేయాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దయాకర్

సత్యవేడు: పాడి రైతులు తాము నివశిస్తున్న ప్రాంతానికి అనుకూలమైన రకం పశువులు కొనుగోలు చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ దయాకర్ కోరారు. మంగళవారం చిన్న ఈటిపాకం గ్రామంలో పశువుల కొనుగోలుపై స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పశువుల రకాలు ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రధానంగా ఒంగోలు, గిర్రు, జెర్సీక్రాస్, హెచ్‌పిక్రాస్ తదితర రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. బర్రె కొనుగోలులో నాటు బర్రెతోపాటు, గ్రేడెడ్ ముర్రా తదితర జాతులను ఎంపిక చేసుకోవడం మంచిదన్నారు. వీటి ధరలు కూడా రకాన్ని బట్టి రూ.50, 80 వేలు వరకు ఉంటాయని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యవంతమైన పశువులు కొనడంతో పాల ఉత్పత్తి పెంచుకోవచ్చని సూచించారు. పశువుల దాణాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘమిత్ర సుగుణ, మహిళా పాడిరైతులు పాల్గొన్నారు.

గుడిమల్లంలో రాజస్థాన్ ఎంపీ

ఏర్పేడు: దేశంలోనే తొలిశైవక్షేత్రమైన ఏర్పేడు మండలం గుడిమల్లం శ్రీఆనందవల్లీ సమేత పరశురామేశ్వరాలయాన్ని మంగళవారం రాత్రి రాజస్థాన్‌కు రాజ్‌సమంద్ లోకసభ ఎంపీ మహిమ కుమారి మేవార్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి ఆమెకు ఆలయ విశిష్టత, శిల్ప సౌందర్యం, చారిత్రక నేపథ్యం గురించి వివరించారు. ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ఆమెను ఘనంగా సత్కరించి ఆలయ తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు లోకసభ సెక్రటరీ జ్యోష్ఠామయిసింగ్ ఆలయాన్ని దర్శించుకున్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- ఎంపికైతే ఏడాదికి రూ.12 వేల స్కాలర్‌షిప్
- ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం



వరదయ్యపాళెం మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

వరదయ్యపాళెం: ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి జాతీయ ప్రతిభా ఉపకారవేతనం (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పథకాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు ఈ పరీక్ష రాసి ఎంపికైతే, వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అంటే నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందిస్తుంది. ఈ పరీక్ష రాసేందుకు ఈ నెల 4న నోటిఫికేషన్ జారీ చేసింది.

అర్హులు

ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకుల, కస్తూర్బా, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల విద్యార్థులు అర్హులు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.5 లక్షల లోపు ఉండాలి. పరీక్షను ఈ ఏడాది డిసెంబర్ 7న నిర్వహించనున్నారు. అర్హులైన వారు పాఠశాల యాజమాన్య వెబ్‌సైట్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులయితే రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులయితే రూ.50 ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే పరీక్ష రుసుం చెల్లించాలి.

దరఖాస్తు విధానం

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థి సంతకం, ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కుల, ఆదాయ ధ్రువ పత్రాలు ప్రస్తుతానికి లేక పోయినప్పటికీ పరీక్ష రాసే సమయానికి సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు www.bre.ap.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. తర్వాత ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు అప్‌లోడ్ చేయాలి. అనంతరం అదే లాగిన్‌లో ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలి. ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లుగా ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ టెస్ట్(మ్యాట్), స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సాట్) ఇలా రెండు పేపర్లు కలిపి 180 పశ్నలకు 180 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు. మెంటల్ ఎబిలిటీ (మ్యాట్)లో 90 మార్కులు ఉంటాయి. సాట్ పేపర్‌లో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 80 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో సైన్స్ 35 ప్రశ్నలు, సోషల్ స్టడీస్ 35, మ్యాథమెటిక్స్ విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలను అడుగుతారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

నారాయణవనం: మండల స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్‌లో పాల్గొనే బాల క్రీడాకారులను గురువారం నుండి రెండు రోజులపాటు ఎంపిక చేస్తున్నట్లు బాలుర ఉన్నత పాఠశాల పీడీ రాజా తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల పిల్లలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురు, శుక్రవారాలలో మండలంలోని నారాయణవనం, పాలమంగళం ఉన్నత పాఠశాలల క్రీడామైదానాలలో సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు.

అవార్డు గ్రహీతకు అభినందన

తొట్టంబేడు : మండలంలోని దిగువసాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని, జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకుని రావాలని సూచించి బాలుకి శుభాకాంక్షలు తెలియజేశారు.

దొంగ ఓట్లను అరికట్టండి

శ్రీకాళహస్తి: దొంగ ఓట్లను అరికట్టండి – ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అని ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిందని తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ షేక్ కరీముల్లా అన్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు ఈ మహత్తర పోరాటానికి బలాన్ని చేకూర్చే విధంగా సంతకాల సేకరణ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా దొంగ ఓట్లను అరికట్టండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అనే నినాదాన్ని బలపరుస్తూ మంగళవారం శ్రీకాళహస్తిలో ప్రజల వద్ద నుంచి సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘాలు రైతులకు బాసటవ్వాలి

శ్రీకాళహస్తి : ప్రాథమిక సహకార పరపతి సంఘాలు రైతులకు బాసటగా నిలవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సూచించారు. కాపుగున్నేరి, తంగేళ్లపాలెం సహకార సంఘాల నూతన కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. కాపుగున్నేరి సహకార సంఘానికి అధ్యక్షుడిగా బత్తిరెడ్డి, తంగేళ్లపాలెం అధ్యక్షుడిగా భీమాల భాస్కర్, సభ్యుల చేత ప్రమాణం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



కార్తీక్(ఫైల్)

నాగలాపురం: మండలంలోని చిన్నాపట్టు గ్రామానికి చెందిన జి.కార్తీక్(30) ఈ నెల 10వ తేదీ కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమిళనాడులోని చెన్నై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్తీక్ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. మృతుని తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. మృతునికి వివాహమైంది.

నేతలతో సమావేశం



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున కేవీ నిరంజన్‌రెడ్డి



భూమనకు శాలువా కప్పి సన్మానిస్తున్న సత్యవేడు నాయకులు

సత్యవేడు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్ఆర్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డిని ఆ పార్టీ సత్యవేడు నాయకులు కలిశారు. మంగళవారం సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీగా నియమితుడైన కేవీ నిరంజన్‌రెడ్డిని నియమించినందుకు నేతలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు బీరేంద్రవర్మ, భానుప్రకాష్ రెడ్డి, బెల్లు రమేష్, మస్తానీ, పళణి, సెంథిల్, సోము తదితరులు ఉన్నారు.

రాష్ట్ర గవర్నర్‌కు సాదర వీడ్కోలు



రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న జిల్లా అధికారులు

రేణిగుంట: తిరుపతి జిల్లా మూడు రోజుల పర్యటన అనంతరం మంగళవారం సాయంత్రం తిరుగు ప్రయాణమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి సాదర వీడ్కోలు పలికారు. విమానాశ్రయంలో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శుభం బన్సల్, అడిషనల్ ఎస్పీ కె.రవిమనోహరాచారి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఏర్పేడు: రాష్ట్రప్రభుత్వం 2023 జూలై నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఆర్‌సీకి సంబంధించి కమిటీని వెంటనే ప్రకటించాలని, అంతవరకు తాత్కాలికంగా 30శాతం మధ్యంతర భృతిని మంజూరు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ప్రచార జాతాలో భాగంగా మంగళవారం ఏర్పేడు మండలంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పీఆర్‌సీకి సంబంధించి కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, ఆ కమిటీ రాజీనామా చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు తాము అధికారంలోకి వస్తే మెరుగైన పీఆర్‌సీతోపాటు ఆర్థిక ప్రయోజనాలు చేకూరే నిర్ణయాలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని, అయితే ఇంతవరకు పీఆర్‌సీని ప్రకటించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, జిల్లా నాయకులు దండు రామచంద్రయ్య, వయ్యాల మధు, దేవరాల నిర్మల, ఏర్పేడు మండల నాయకులు గురవా రెడ్డి, రాధాకృష్ణ, మునిరత్నం, రమేష్, సుధాకర్, హరినాథ్, గణేష్, సుబ్రమణ్యం, మురళీ, రజియా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రణభేరి

శ్రీకాళహస్తి: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే యూటీఎఫ్ రణభేరిని మోగించిందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన యూటీఎఫ్ రణభేరి ప్రచార యాత్ర మంగళవారం శ్రీకాళహస్తి పట్టణానికి చేరుకుంది. స్థానిక ఏపీ సీడ్స్ కూడలి వద్ద శ్రీకాళహస్తి ప్రాంత యూటీఎఫ్ నాయకులు యాత్రకు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి పుచ్చలపల్లి సుందరయ్య భవన్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయంగా ఇవ్వాల్సిన 12వ పీఆర్సీ ఊసే లేదని, ఈ కాలంలో కనీసం ఒక్క డీఏ కూడా ఇవ్వకపోగా, రూ.వేలాది కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, రామచంద్రయ్య, మోహన్ బాబు, నిర్మల, మణి గండన్, సూర్య ప్రకాష్, మధు, వెంకటకష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చలో తిరుపతి



మైనార్టీ సదస్సుకు కదిలిన ముస్లిం మైనార్టీలు

శ్రీకాళహస్తి : ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం తలపెట్టిన ఉమ్మడి తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ మైనార్టీ సదస్సుకు మంగళవారం శ్రీకాళహస్తి ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్ ఆధ్వర్యంలో బయలుదేరారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి ముస్లిం మైనార్టీలంతా కదిలి వెళ్తున్నామని తెలిపారు.

రక్తదానం శిబిరం

శ్రీకాళహస్తి : ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన ×సేవా పక్షోత్సవాలు×లో భాగంగా బుధవారం పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. నరేంద్రమోదీ జన్మదిన 'సేవా పక్షోత్సవాలు'లో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సేవా పక్షోత్సవాలుగా నిర్వహించడానికి బీజేపీ నిర్ణయించిందని దానిలో భాగంగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఏర్పేడు సింగిల్‌విండో చైర్మన్‌గా మహేష్‌రెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న మహేష్‌రెడ్డి

ఏర్పేడు: ఏర్పేడు సింగిల్‌విండో చైర్మన్‌గా కందాటి మహేష్‌రెడ్డి మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ఏర్పేడు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకార సభకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రైతుల సంక్షేమానికి నూతన కార్యవర్గం పని చేయాలని సూచించారు. చైర్మన్‌తోపాటు సింగిల్‌విండో డైరెక్టర్‌గా గాలి కృష్ణవేణి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారిని టీడీపీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏర్పేడు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులు నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, పొన్నారావు, వేమూరి బాలాజినాయుడు, మోహన్‌రావు, శివశంకర్‌రెడ్డి, కన్నలి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



వాలీబాల్ క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ కె.రవి



బుచ్చినాయుడుకండ్రిగలో కబడ్డీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

సత్యవేడు: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ కె.రవి అన్నారు. మంగళవారం స్థానిక జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటలను ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. మండల స్థాయి పోటీలో ప్రతి కనబరిచే క్రీడాకారులకు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో ఆడే అవకాశాలు ఉంటుందన్నారు. తొలిరోజు నిర్వహించిన కబడ్డీ పోటీలో బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచారు. వాలీబాల్‌లో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ –2 ఉషా, ప్రిన్సిపల్ సత్యనారాయణ, పీడీ మురళి, నాగరాజు, రవికుమార్, వెంకటేశులు, మణి, ఢిల్లీరాణి, రాజాతీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీల్లోనూ రాణించాలని ఎంపీడీఓ మోతి తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ క్రీడల నిర్వహణలో భాగంగా మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, హెచ్ఎం రమణయ్యలతో కలసి ప్రారంభించారు. ఈ పోటీలలో నెలవాయి, కల్లివెట్టు, చల్లమాంబపురం, బుచ్చినాయుడుకండ్రిగ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ సత్తా చాటాలన్నారు. క్రీడల వలన మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని పొందుతారని తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడాకారులను ఎన్నుకోవడానికి ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ సుధాకర్ నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు మస్తాన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాల్లో అవకతవకలు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రమేష్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల, డీలర్లు అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డివిజన్ ఏడీఏ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని రైతు సేవా కేంద్రంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు నిల్వ, గ్రౌండ్, రిజిస్టర్, ఈపాస్ మెషిన్ బాలన్స్ ఈక్వల్‌గా ఉండాలని, తేడా ఉంటే లైసెన్స్ రద్దు చేసి, 6ఏ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు తగిన మోతాదు అమ్మాలని తెలిపారు. రైతులకు బయో ఫెర్టిలైజర్స్, నానో యూరియా, డీఏపీలపై అవగాహన కల్పించి, తగు మోతాదులో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షణ్ముగం, ఏఈఓ రేవతి, తదితరులు పాల్గొన్నారు.


మనసును జయించిన మహాత్ములే గురువులు



ఉపదేశం చేస్తున్న యోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీ

శ్రీకాళహస్తి: "మనసుకు దాసోహం అయ్యేవాడు మానవుడు.. మనసును జయించే వాడే మాధవుడు.. మనసును జయించిన మహాత్ములే గురువులు.. గురువులే మాధవుల ప్రతిరూపం" అని కాశీవన క్షేత్రం పీఠాధిపతి శ్రీయోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీ ఉపదేశించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని శుకబ్రహ్మ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో భాగంగా చివరి రోజు కాశీవన క్షేత్రం పీఠాధిపతి శ్రీయోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీ ఉపదేశం చేశారు. ఈ సందర్భంగా గురువు దైవంతో సమానమని, గురు సాంగత్యంలో సాధన చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గంలో సాగి మోక్షమార్గాన్ని పొందాలన్నారు. గురువు పట్ల భక్తి భయంతో ఉంటూ భక్తి యోగ సాధన ద్వారా ముక్తియోగం పొందాలని మాతాజీ సూచించారు. ప్రవచనాలు ముగింపు సందర్భంగా శుక బ్రహ్మ ఆశ్రమం తరఫున ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామి యోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీని ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు అందజేశారు. శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాతాజీని ఘనంగా సత్కరించారు.

కూలిన రైల్వే స్టేషన్ ప్రహరీ గోడ







రేణిగుంట: మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి రెండు గంటల సమయం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతలన్నీ జలమయమయ్యాయి. రైల్వే స్టేషన్ ముందు ఉన్న ప్రహరీ గోడ భారీ వర్షానికి నేల కూలింది. ప్రహరీ గోడ పక్కనే నివాసం ఉంటున్న రవి ఇందిర దంపతుల ఇంటిపై ఈ గోడ కూలడంతో సుమారు రూ.లక్ష వరకు నష్టపోయినట్లు తెలిపారు. ఓల్డ్ చెక్ పోస్ట్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జిలో సుమారు రెండు అడుగుల వరకు నీళ్లు నిలిచి పోవడంతో రాకపోకలు తెల్లారే వరకు స్తంభించాయి.

ఆర్థిక సంఘం నిధులు విడుదల

నారాయణవనం: మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.81,560,058 కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఈఓపీఆర్డీ డాక్టర్ వేణయ్య తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కార్యదర్శులతో చర్చించి, ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో వేణయ్య మాట్లాడుతూ ఆర్థక సంఘం నిధులను వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య పరికరాల కొనుగోలు, తాగునీటి ఏర్పాట్లు, గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల జీతాలు, చెత్త సేకరణకు ట్రైసైకిళ్ల కొనుగోళ్లకు మాత్రమే వినియోగించాలన్నారు. సమావేశంలో పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.